క్లుప్తంగా

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



శ్రీ రంగనాథ ఆలయంలో స్వామివారి మూల విరాట్‌ను అలంకరిస్తున్న పూజారులు

సి.బెళగల్: వైకుంఠ ఏకాదశి వేడుకలకు మండలంలోని ఆలయాలను ముస్తాబు చేశారు. నేడు(సోమవారం) ఉత్తర ద్వారం దర్శనం చేసుకునే భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని కొటారుమిట్ట కాలనీలో ఉన్న శ్రీ రంగనాథుడి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నిర్వాహకులు ఆదివారం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. గర్భగుడిలోని మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు పెద్ద ఎత్తున పూజలు చేసేందుకు, పోలకల్ గ్రామంలోని శ్రీ చెన్న సోమేశ్వరస్వామి, గుండ్రేవుల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వాముల ఆలయంను సైతం భక్తుల దర్శనం కోసం సన్నద్ధం చేశారు.

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో జెఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్మించిన బాలాజీ ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వర ఆలయం దాదాపు రూ.5 కోట్లతో నిర్మించారు. ఆలయ ప్రాంగణాల్లో పచ్చటి చెట్లు, ఆలయం చుట్టూ ఉన్న కోనేర్లు భక్తులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకునేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అలాగే పెసరవాయి, బూజునూరు గ్రామాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలను వైకుంఠ ఏకాదశి వేడుకలకు సిద్ధం చేశారు.



బిలకలగూడూరు సమీపంలోని బాలాజీ టెంపుల్

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు: ఈ నెల 7న ఓర్వకల్లులో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నిరుద్యోగులకు సూచించారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఓర్వకల్లు మండలంలోని మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంతో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాటసాని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 15 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆయా పోస్టులకు పదవ తరగతి నుంచి పీజీ వరకు అర్హతలు ఉన్నా నిరుద్యోగులు htt p@//surl. li/efykz వైబ్‌సైట్ చూడలన్నారు. సమాచారం కోసం 6300373877, 7569068058 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇద్దరు కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌ల సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను దగా చేసిన ఇద్దరు కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లను వారం రోజుల పాటు సస్పెండ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తూ సెక్రటరీ గోవిందు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31న కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన నారాయణ లలితాదేవి ట్రేడర్స్, కమీషన్ ఎజెంటు దగ్గర కందులు, రాకేష్ ట్రేడింగ్ కంపెనీ కమీషన్ ఏజెంటు దగ్గర ఆముదాలు అమ్మకానికి పెట్టారు. వ్యాపారులు ఈ–నామ్‌లో కొనుగోలు చేశారు. ఇద్దరు కమీషన్ ఏజెంట్లు హమాలీ చార్జీల కింద వసూలు చేయాల్సిన మొత్తం కంటే ఎక్కువగా వసూలు చేశారు. దీనిపై రైతు నారాయణ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై పాలక వర్గం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సెక్రటరీ గోవిందు విచారణ జరిపించారు. విచారణలో రైతును దగా చేసినట్లు తేలింది. దీంతో కమీషన్ ఏజెంటుల లైసెన్స్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సస్పెండ్ చేయడంతో పాటు రూ.5000 ప్రకారం జరిమానా విధించారు. సంబంధిత రైతుకు దగా చేసిన మొత్తానికి రెట్టింపు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

అనాథ పిల్లలకు అన్నదానం

కర్నూలు(హాస్పిటల్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని హోమ్ ఆఫ్ హోప్‌లో అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుతో అందరి కళ్లల్లో ఆనందం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- నూతన సంవత్సర వేళ పెంచిన పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేసిన అవ్వాతాతలు



పంచలింగాలలో వృద్ధురాలికి పెంచిన పెన్షన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఉల్చాలలో వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



ఆలమూరులో నార్ల లక్ష్మమ్మకు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ జానకి

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.2,750 పెంచడంతో వృద్ధులు, వితంతువులు, మత్స్యకారులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు కళ్లల్లో ఆనందం నింపారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. దీంతో నూతన సంవత్సరం వేళ వారి కుటుంబాల్లో సంతోషం నెలకొందన్నారు. ఆదివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వృద్ధులకు పెంచిన పెన్షన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలపరిచేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్నారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీ గిరిజోన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఏపీఓ మహమ్మద్‌బాషా, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ఆదివారం పండగలా జరిగింది. నూతన సంవత్సరం కావటం, పెంచిన పెన్షన్ అందుకోవడంతో అవ్వాతాతలు, ఇతర లబ్ధిదారుల మోముల్లో సంతోషాలు వెల్లివిరిశాయి. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ అందజేశారు. మండలంలోని పోలకల్ గ్రామంలో ఎంపీపీ బొంతల మునెప్ప పెరిగిన పెన్షన్ సొమ్మును అవ్వాతాతలకు పంపిణీ చేశారు. అదేవిధంగా బీసీ కాలనీలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పెన్షన్ అందజేశారు. మండల కేంద్రం సి.బెళగల్ గ్రామ సర్పంచ్ పాండురంగన్న, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ముందరింటి వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల, కొత్తకోట, ముడుమాల గ్రామాలలో సర్పంచ్‌లు దస్తగిరి, ఇమ్మానియేల్, శ్రీనివాసులు, బతుకమ్మ, కంబదహాల్, ఇనగండ్ల, కొత్తకోటలో ఎంపీటీసీ సభ్యులు శోభారాణి, తిమ్మలమ్మ, మణిమోహన్‌రెడ్డి పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.2,750 పెంచి లబ్ధిదారుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. ఆదివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను వృద్ధులు, వితంతువులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆదివారం పెన్షన్ పంపిణీని ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిర్వహించారు. చనుగొండ్లలో మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల, కె.నాగలాపురంలో వైస్ ఎంపీపీ రాజమ్మలు పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. పెరిగిన పెన్షన్ అందుకున్న అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 3000 వరకు పెన్షన్‌లు ఉండగా కొత్తగా ప్రభుత్వం 100 పెన్షన్లను మంజూరు చేసింది. దీంతో పాత లబ్ధిదారులతో పాటు కొత్త వారికి పెన్షన్ సొమ్మును అందించినట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు.

గడివేముల: గడివేముల మండలంలోని 14 సచివాలయాల పరిధిలో సూర్యోదయానికి ముందే వలంటీర్లు లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులను అందించారు. రూ.2500 నుంచి రూ.2750 పెంచిన పెన్షన్ డబ్బులను అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 5715 పింఛన్లకు గాను 4528 పింఛన్లు పంపిణీ చేసి 79.23 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి తెలిపారు.

గడివేములలో 79.23 శాతం పంపిణీ

కల్లూరు: కల్లూరు మండలంలో ఆదివారం వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో 8111 పాత పింఛన్లు ఉండగా కొత్తగా 168 అదనంగా మంజూరయ్యాయి. పాత, కొత్త పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్‌సొమ్ము అందజేశారు.

పాణ్యం: మండలంలో వలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ సొమ్మును అందించారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో 6348 మంది లబ్ధిదారులకుగాను తొలిరోజు 4618 మందికి పింఛన్ అందించారు. దీంతో 72.75 శాతం పింఛన్ పంపిణీ పూర్తి అయినట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు.



సి.బెళగల్ వృద్ధురాలికి పెరిగిన పెన్షన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ పాండురంగన్న



చనుగొండ్లలో ఖాసీంసాబ్‌కు పెన్షన్ సొమ్ము అందిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు దౌల



సి.బెళగల్ మండలంలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప



తడకనపల్లెలో వృద్ధురాలు అయ్యమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ వరలక్ష్మీ



గడిగరేవులలో షేక్ అమినాబీకి పెన్షన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ రేష్మాబీ



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు



మేయర్ బీవై రామయ్యకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయ నాయకుల ఇండ్ల వద్ద సందడి నెలకొంది. ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, ఎంపీ సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డిని వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు కలిసి పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కోడుమూరులో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల నుంచి భారీ ఎత్తున వచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కోడుమూరు ఎంపీపీ రూతమ్మ, గూడూరు ఎంపీపీ సునీత, మండల కన్వీనర్లు సి.బెళగల్ శేఖర్‌రెడ్డి, జూలకల్ భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో ఆదివారం కొత్త సంవత్సరం సందడి నెలకొంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్, మాజీ జెడ్పీటీసీ మెంబర్ ఎల్.వెంకటేశ్వర్లు ఇళ్ల వద్దకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వెళ్లి వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



కోడుమూరులో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కోట్ల హర్షను కలిసిన నాయకులు, కార్యకర్తలు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి : ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో అందరి సమక్షంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దంపతులను, తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డిని గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలన్నారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

నూతనోత్సాహంతో పనిచేద్దాం :మేయర్ కల్లూరు: నూతన సంవత్సరంలో మరింత నూతనోత్సాహంతో పార్టీ అభివృద్ధి కోసం పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా మేయర్ క్యాంపు కార్యాలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, ఏ ఇంటికి వెళ్లినా పథకాల గురించే మాట్లాడుతున్నారన్నారు. మరో ఏడాదిన్నరలో రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే అని ధీమా వ్యక్తం చేశారు. పథకాల గురించి విపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. మూడు రాజధానుల ఆకాంక్షకు తోడుగా జనం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతారన్నారు. ఈ మూడున్నర ఏళ్లలో చేపట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నగర అధ్యక్షురాలు సితర నారాయణమ్మ, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంహెచ్‌వో విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ శేషసాయి, మేనేజర్ చిన్నరాముడు మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

అందరూ సంతోషంగా జీవించాలి

కర్నూలు (న్యూటౌన్): ప్రజలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆకాంక్షించారు. ఆదివారం ఎమ్మెల్యేకు ఆయన నివాసంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల నుంచి ప్రజలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పెన్నులు, నోటు పుస్తకాలు, పూలబొకేలు, మొక్కలు, స్వీట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేత కేక్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రాబోయే ఎన్నికల్లో మరోసారి కోడుమూరులో పార్టీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని అన్నారు. నూతన సంవత్సరంలో పెంచిన పింఛన్ రూ.2,750ను ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండడంతో అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు.

సి.బెళగల్/గూడూరు రూరల్: సి.బెళగల్, గూడూరు మండలాల్లో నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. శనివారం రాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు, ప్రజలు వేడుకలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త సంవత్సరం అంతా మంచి జరగాలని ఆదివారం ఉదయం ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లా, నియోజకవర్గ నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామం కొండపై వెలసిన శ్రీ కోన వెంకటేశ్వర స్వామి ఆలయానికి యువకులు, విద్యార్థులు, భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల పరిసరాలలో కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కొంత మంది వారి మిత్ర బృందం ఏక రూపు దుస్తువులు ధరించి సెల్ ఫోన్లలో సెల్ఫీలను తీసుకొని సందడి చేశారు. స్థానిక అమెరికన్ బాప్టీజమ్ మెమోరియల్ (ఏబీఎం) చర్చిలో పాస్టర్ సోలోమోన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం పురస్కరించుకొని ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

పాణ్యం: పాణ్యంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, పోలీసులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండజుటూరు గ్రామంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డికి మండల స్థాయి నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి. ఎంపీడీఓ దస్తగిరి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపీపీకి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే దంపతులకు, యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డికి, ఎమ్మెల్యే కుమార్తె కాటసాని మాధవీలతకు పాణ్యం మండల కొత్తూరు శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ఈఓ రామకృష్ణ, అర్చకులు నారాయణ, వీరయ్య ఆశీర్వదించి జ్ఞాపిక, స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.



ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కర్నూలు ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, మండల అధికారులు



పాణ్యం సర్కిల్ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న సీఐ, ఎస్ఐలు



సి.బెళగల్ ఏబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేడు గ్రామ సభలు

సి.బెళగల్: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో సోమవారం గ్రామ సభలు నిర్వహించాలని ఈఓఆర్డీ సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించి, గ్రామాల అభివృద్ధిపై చర్చించాలన్నారు. ఇందు కోసం వార్డు సభ్యులకు, గ్రామ ఓటర్లకు సమాచారం అందజేయాలన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

కర్నూలు(న్యూటౌన్): ఈ నెల 2వ తేదీన (నేడు) ఉదయం 10.30 గంటల నుంచి 2 గంటల వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దార్ డి.వెంకటేష్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందనలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏమైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు నిర్వహించే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు, మధిర బాలలకు ఐఈఆర్‌టీలు పరికరాలతో విద్యను అందిస్తారన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కురుబ సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో కురుబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ సర్పంచు పెద్దయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా కోశాధికారి కేసీ నాగన్న, నగర సంఘం నాయకులు దివాకర్, మండల అధ్యక్షుడు అల్లబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే జీవాలు అపుకునేందుకు కురుబలకు ప్రత్యేకంగా ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని కోరారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ వ్యవస్థాపకాచార్య శీల ప్రభు పాద ప్రేమ విందు కార్యక్రమం ఆదివారం భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో జరిగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరే నామ సంకీర్తన జపం యజ్ఞం జరిగింది. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశం ఇచ్చారు. భగవద్గీత పంఠనం, శ్రవణం చేయాలన్నారు. ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.